నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
గుంటూరు పల్నాడు
గురువారం
20 జూన్
2024
పేజీలు 8



# దోమలు బాబోయ్ దోమలు

పట్టణాలు పల్లెలు అనే తేడా లేకుండా డ్రైనేజీ కాలువల్లో మురుగు నీరు ముందుకు కదలకపోవడంతో దండిగా దోమలు చేరి ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. జనం కంటిపై కునుకు లేక ప్రతి రాత్రి శివరాత్రి లా జాగారం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో ఫాగింగ్ చేయాల్సిన అధికారులు మౌనంగా ఉండి చెలరేగిపోతున్న దోమల దెబ్బకు ప్రజలు అనేక రోగాల బారినపడి ఆసుపత్రుల్లో మంచ మెక్కుతున్నారు. నగదు కొరత చూపి పంచాయతీ అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. పోయిన మురుగు కాలువల రిపేర్లు లేవు. దోమల నివారణకు అవసరమైన ఆయిల్ బాల్స్ కొనడానికీ డబ్బుల్లేవు.. పోనీ మరమ్మతుకు గురైన ఫాగింగ్ మిషన్లు బాగు చేసుకోవడానికి, కూడా నిధులు లేవు.ఉన్నవాటిని వినియోగించడానికి అవసరమైన మందులు, ఇంధనం కొనుగోళ్లకు చిల్లిగవ్వ లేదు. నిధులివ్వండి మహాప్రభో అని మొత్తుకుంటే ఇంటి పన్నుతోముడిపెడుతున్నారు. పన్ను వసూలు చేసి ఆ డబ్బుతో పారిశుధ్యం పనులు చేయండని ఉన్నతాధికారులు సెలవిస్తున్నారు. ఇంకేముంది.. ఇంటి పన్ను వసూలు అయ్యేవరకు ప్రజలపై దోమల దండు దయపెడుతాయా!? నిధులొచ్చే వరకు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు ఉపేక్షిస్తాయా...

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక
సూర్య బ్యూరో





- రహదారుల గోతుల్లో వర్షపు నీరు
- పలుచోట్ల పనిచేయని ఫాగింగ్ యంత్రాలు
- పల్లెల్లో కొరవడిన పారిశుధ్యం
- పట్టణాలపై దండయాత్ర చేస్తున్న దోమలదండు

ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉన్నా కరోనా విపత్తు తరువాత ప్రజారోగ్యం పట్ల మరింత బాధ్యతగా వ్యవహరించి ఉండాలి. కానీ ప్రభుత్వాధినేత అనుకున్న కొన్ని పథకాల విషయంలో మినహా పాలనా పరంగా మరే విషయాలపైనా దృష్టి సారించడం లేదనే విమర్శలకు జిల్లాలోని పరిస్థితులు బలం చేకూర్చుతున్నాయి. వర్షాకాలం మొదలయ్యింది. ఈ సీజనలో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ. పట్టణాలు, పల్లెల్లో నిత్యం పారిశుధ్య చర్యలు చేపడితే తప్ప వ్యాధుల బారి నుంచి తప్పించుకోలేము. ముఖ్యంగా దోమల నివారణ చర్యలు అత్యంత ముఖ్యం. కానీ అది గుంటూరు జిల్లాలో కేవలం కొన్ని ప్రాంతాల్లో మినహా మరెక్కడా దోమల నివారణ చర్యలు మొదలు కాలేదు. ఇదే పరిస్థితులు కొనసాగితే ఇప్పట్లో మొదలయ్యే అవకాశమే లేదు. కారణం నిధుల కొరత. మురుగు కాల్వలు శుభ్రం చేయడానికి దోమల నివారణ చర్యలు చేపట్టడానికి మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత తీవ్రంగా ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదు. మున్సిపాలిటీల్లో, పంచాయతీల్లో పైసా లేదు.దోమల నివారణ చర్యలు పూజ్యం నరసరావుపేట మున్సిపాలిటీలో సరైన ఫాగింగ్ మిషన్లు లేవనే ఆరోపణలు వస్తున్నాయి జనాభా అవసరాలను మిగతా 3వ పేజీలో

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**వివిధ శాఖల అధికారులను ఆదేశించిన పవన్ కళ్యాణ్**
**బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమీక్ష నిర్వహించిన పవన్**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే బుధవారం తన శాఖ పరిధిలో ఉన్న ప్రభుత్వ అధికారులతో శాఖాపరమైన సమీక్షలు నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల ఉన్నతాధికారులతో ఈ సమీక్షలు ఏర్పాటు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం పదవి బాధ్యతలు మిగతా 3వ పేజీలో







# సీడ్స్ షాపులపై మెరుపు దాడి

- కేసులు నమోదు చేయాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశం
- రూ.11 లక్షల విలువ గల విత్తనాలు స్వాధీనం
- చేబ్రోలు, బొల్లాపల్లి మండలాల్లో విజిలెన్స్ దాడులు

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

గుంటూరు జిల్లా చేబ్రోలు పల్నాడు జిల్లా, బొల్లాపల్లి మండలం మర్రిపాలెంలోని సీడ్స్ షాపులపై బుధవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అనుమతులు లేకుండా విత్తనాలు అమ్ముచున్నట్లు గుంటూరు విజిలెన్స్ ఎన్ఫోర్సు మెంట్ అధికారులకు సమాచారం అందింది. దీంతో, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్ఫోర్సు మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు, గుంటూరు రీజనల్ విజిలెన్సు ఎన్ఫోర్సు మెంట్ అధికారి మిగతా 3వ పేజీలో

# APPSC గ్రూప్-2 మెయిన్స్:వాయిదానా..? జరిగేనా..?

ప్రతిసారీ పోటీ పరిక్షలకి ప్రిపేర్ అయ్యేటపుడు ఏదో ఒక సమస్య ఉద్యోగార్ధులను పట్టి పీడిస్తుంది. ప్రశాంతంగా ప్రిపేరవ్వనివ్వదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది కాబట్టి పరీక్షలు అవి ఏవయినా గానీ గ్రూప్-2 మెయిన్స్, గ్రూప్-1 మెయిన్స్ లాంటివి వాయిదా పడుతాయన్నది అత్యధికుల అభిప్రాయం. పరీక్షలు వాయిదా కావాలి అన్నవారు బేసిక్‌గా ఫ్రెషర్స్ మరియు ఎలక్షన్ డ్యూటీలంటూ చేసి అలసిపోయి ఉన్న టీచర్లు మరియు పోలీసులు అని చెప్పవచ్చును. దానికి తోడు నిజానికి గ్రూప్-2 మెయిన్స్‌లో సైన్స్ & టెక్నాలజీ కొత్త సబ్జెక్టు కాబట్టి దానికొరకయినా ప్రిపరేషన్ కొరకు సమయం గట్టిగా అవసరం అని మరికొందరు భావిస్తున్నారు. ప్రభుత్వం మారింది కాబట్టి ఎ.పి. ఎకానమీని మళ్ళీ కొత్తగా చదవాల్సి ఉంది కదా! కనుక పరీక్ష వాయిదానే మంచిదని కొందరు ఉద్యోగార్ధుల అభిప్రాయం.

మరికొంతమంది అయితే ఒకడుగు ముందుకేసి ఎగ్జాం క్యాన్సిల్ అవుద్దంట అంటూ పుకార్లు కూడా లేపుతున్నారు. ఇన్నింటి గందరగోళాల మధ్య సగటు విద్యార్థి చదివేదెలా? జాబ్ సాధించేది ఎలా?

మీరు గమనించారా? తెలంగాణా రాష్ట్రంలో గ్రూప్‌వన్ ప్రిలిమ్స్ ముచ్చటగా మూడోసారి జరిగింది. మళ్ళీ మళ్ళీ రాయడానికి ఉద్యోగార్ధులకు ఎంత ఓపిక ఉండాలి?! వ్యవస్థ అలా ఉంది. నేను కూడా తొలుత జె.ఎల్.కావడానికి మూడుసార్లు పరీక్ష రాయవలసి వచ్చింది. కారణం ప్రకటించిన తేదీకి పరీక్ష జరగక పోవటం వల్ల మూడుసార్లు వాయిదా పడింది. దీనివల్ల ప్రిపరేషన్ చేసే ఉద్యోగార్ధుల్లో ఆసక్తి సన్నగిల్లుతుంది. ఫస్ట్‌సారి ఎగ్జాం తేదీకి ఉద్యోగార్ధులు ఉరకలెత్తే ఉత్సాహంతో ప్రిపేరవుతారు. కానీ పరీక్ష జరగకపోయేటప్పటికి నిరాసక్తత వారిని ఆవరిస్తుంది. అలానే రెండోసారి పరీక్ష రాయడానికి మొదటిసారి పరీక్ష రాయడానికి సిద్ధపడినవారు రాయరు. కనుక ఈసారి పరీక్ష రాయడానికి కొత్తవాళ్ళు వస్తారు. అంటే దరఖాస్తు చేసుకొని మొదటిసారి ఏవేని కారణాల రీత్యా రాయని వారు అన్నమాట. ఇక రెండోసారి కూడా వాయిదా పడిందనుకోండి మరి మూడోసారి పరీక్ష రాసేవారు ఎవరనుకుంటారు? మళ్ళీ కొత్తవారు. ముచ్చటగా మూడోసారి రాసిన బ్యాచ్ ఉద్యోగాలకి ఎంపిక అవుతారు. కానీ నిజానికి మొదటిసారి పరీక్ష రాయటానికి వచ్చిన వారికి జాబ్స్ రావాలి. కానీ వాయిదాల పరంపర వల్ల చివరిసారిగా ప్రిపేరయిన వారు ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలయితే ఏదో ఒక జాబ్ సాధించారు కానీ ఎంత విలువయిన సమయం పోయింది?

ఆంధ్రాలో కొత్త ప్రభుత్వం రావడం వలన మెయిన్స్ పరీక్షలు వాయిదా పడే అవకాశం ఉందనుకుంటున్నారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వడం ఆలస్యం చేసింది. కానీ పరీక్ష మాత్రం చెప్పిన తేదీకి పెట్టేసింది. ఏ ఒక్క పరీక్షను గత ప్రభుత్వం వాయిదా వేయలేదు. గ్రూప్-2 ప్రిలిమ్స్ వాయిదా వేయమని ఎంతగా అభ్యర్థించినా పరీక్ష పెట్టేసారు. కానీ వాయిదా వేయలేదు. కాగా గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ప్రకటన తేదీ జులై 28. ఇంకా నెలన్నర సమయం ఉంది. ఒకరకంగా ఇది పెద్ద సమయమే. కానీ ఎక్కువగా మెయిన్స్‌కి టీచర్లు, పోలీసు శాఖలో పనిచేస్తున్న వారున్నారు. వీరిద్దరూ ఎన్నికల డ్యూటీలు చేసి ఉండటం వల్ల వాయిదా కావాలనే వాదన వీరినుండి ఎక్కువగా వినపడుతున్నది.

**ఆంధ్రాలో కొత్త ప్రభుత్వం రావడం వలన మెయిన్స్ పరీక్షలు వాయిదా పడే అవకాశం ఎక్కువగా ఉందనుకుంటున్నారు. పరీక్షలు వాయిదా కావాలి అనేవారు బేసిక్‌గా ఫ్రెషర్స్ మరియు ఎలక్షన్ డ్యూటీలంటూ చేసి అలసిపోయి ఉన్న టీచర్లు , పోలీసులు అని చెప్పవచ్చును. దానికి తోడు నిజానికి గ్రూప్-2 మెయిన్స్‌లో సైన్స్ & టెక్నాలజీ కొత్త సబ్జెక్టు కాబట్టి దాని ప్రిపరేషన్ కొరకు సమయం గట్టిగా అవసరం అని మరి కొందరు భావిస్తున్నారు.**



**సిలబస్ నాలుగు పేపర్లు...**

అయితే మనం ఇపుడు సిలబస్ వద్దకు వద్దాం. మళ్ళీ చెపుతున్నానని అనకండి. సిలబస్ 2023 ఏప్రిల్ 27వ తేదీన వచ్చింది. నాలుగు పేపర్లు. ఇందులో ఎ.పి. హిస్టరీ, పాలిటీ చదివేసి పెట్టుకోవచ్చు. ఇక ఎకానమీ ఇండియన్ ఎకానమీ చదివేసి పెట్టుకోవచ్చు. కొత్తదల్లా సైన్స్ & టెక్నాలజీ. దీనికొరకు కష్టపడాలి. మార్కెట్‌లో ఒక మంచిబుక్ అంటూ ఉందో లేదో తెలియదు. ప్రిలిమ్స్‌లో ఆ పుస్తకం, ఈ పుస్తకం అని సొసైటీని చదివి కనీసంలో కనీసం పది మార్కులు సాధించటం కూడా గగనం అయింది. హిస్టరీ, జాగ్రఫీ బతికించినాయి. ఇదెలా ఉంటుందంటే, మనం చదివేదేమో ఒకటి, అక్కడ అడిగేదేమో మరొకటి. ఈ రెండిటి మధ్యలో మనం కళ్ళు తేలవేయడం జరుగుతుంది. కనుక పరీక్షకి అంతా ప్రిపేరయిపోయాం అనుకోవటానికి వీలు లేదు. ఎంతోకొంత మిగిలే ఉంటుంది. ఆ మిగిలినది ఒకవేళ పరీక్ష వాయిదా పడితే ప్రిపరేషన్ కింద ఉపయోగించుకోవాలి.

చంద్రబాబునాయుడుగారి నూతన ప్రభుత్వం ప్రతి డిపార్టుమెంటుని ప్రక్షాళన చేయు దిశగా ఆలోచన చేస్తోంది. ఈ ప్రయాణంలో ఎ.పి.పి.ఎస్.సి. కూడా ఖచ్చితంగా ప్రక్షాళన జరుగుతుంది. ఈ వార్త మనకు అందటానికి కొంత కాలం పడుతుంది. ఎలాంటి ప్రక్షాళన జరిగినా అది కక్ష సాధింపు చర్యలాగా లేకుండా నిజానికి ఉద్యోగార్ధులకి ఉపయోగపడాలి. ప్రస్తుత ప్రభుత్వం ఇదే చేస్తుంది అనుకుంటున్నాను. ఎందుకంటే లక్షలాది ఉద్యోగార్ధులు వేలల్లో ఉద్యోగాల సాధనకు వేచి ఉన్నారు. పథకాలు ఓకే, కాని కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం లభిస్తే ఆ కుటుంబ చరిత్ర మారిపోతుంది కదా! ప్రభుత్వాలు ఇది ఆలోచించాలి. నూతన ముఖ్యమంత్రి రాగానే సుమారు పదిహేడువేల డిఎస్సీ పోస్టులపై తొలి సంతకం చేసారు. చాలా సంతోషం.

ఇంత చదివాము కానీ, ఇంతకీ గ్రూప్-2 మెయిన్స్ వాయిదా పడుతుందా? లేదా? అని మీరు మళ్ళీ మొదటికే వచ్చారని నాకు తెలుసు. మనమందరం ఎ.పి.పి.ఎస్సీకి ఒక విన్నపం చేద్దాం! ఎగ్జాం వాయిదా పడేదీ లేనిది అదేదో ఒక నెల రోజుల ముందు చెప్పేస్తే ప్లాన్ చేసుకోవటానికి ఉంటుంది. అభ్యర్ధుల్లోనూ టెన్షన్ తగ్గుతుంది. ప్రిపరేషన్ సాఫీగా సాగిపోతుంది. నేను నిన్ననే (ఈ ఆర్టికల్ రాసే రోజుకి) మన ఎం.ఎల్.సి. శ్రీ చిరంజీవి గారికి ఫోన్ చేసి అడిగాను. మెయిన్స్ వాయిదా పడుతుందాలేదా? అని. తాను అన్నారు. 'డిస్కషన్ చేద్దాం!' అని. కనుక చూద్దాం. ఎలా అయితే అలా సిద్ధం అయిపోవటం మంచిది కదా! అని నా అభిప్రాయం. మీకు విషయం తెలుసా! మెయిన్స్ దగ్గరయ్యే కొద్దీ చాలామంది అభ్యర్ధులు యూటర్న్ తీసుకుంటున్నారు. సుమారు పదిహేడు వేల డి.ఎస్.సి. ఉద్యోగాలు వస్తున్నాయి.

కనుక చాలామంది గ్రూప్-2 మెయిన్స్ వదిలేసి డి.ఎస్సీల వైపు లిటరల్లీ టర్న్ అవుతున్నారు. అలానే కానిస్టేబుల్ కావడానికి వేచి చూస్తున్నవారు ఈవెంట్స్ కొరకు మెయిన్స్ కొరకు రెడీ అవుతున్నారు. కనుక గ్రూప్-2 మెయిన్స్ పోటీ భారం చాలా తగ్గుతుంది. కనుక ఎవరయితే మల్లయుద్ధంలో వీరుడిలా ప్రిపేరవుతారో, పోరాడతారో వారే విజేతలు.

**కనుక గ్రూప్-2 మెయిన్స్‌ను టైమ్ డిసైడ్ చేస్తుంది. మీరు ప్రిపరేషన్‌ని డిసైడ్ చేయండి. మీ సక్సెస్‌ని దేవుడు డిసైడ్ చేస్తారు.**



హిస్టరీ రఫీ సార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

## కరెంట్ అఫైర్స్ — ఏపీ మంత్రులు - శాఖల వివరాలు

- చంద్రబాబు నాయుడు - సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు (ముఖ్యమంత్రి)
- పవన్ కల్యాణ్ - పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ (డిప్యూటీ సీఎం)
- నారా లోకేశ్ - ఐటీ, మానవ వనరులు, రియల్ టైమ్ గవర్నెన్స్
- వంగలపూడి అనిత - హెూంశాఖ, విపత్తు నిర్వహణ
- అచ్చెన్నాయుడు - వ్యవసాయశాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ
- కొల్లు రవీంద్ర - మైనింగ్ మరియు ఎక్సైజ్ శాఖ
- నాదెండ్ల మనోహర్ - పౌరసరఫరాల శాఖ
- నారాయణ -మున్సిపల్ మంత్రిత్వ శాఖ
- సత్య కుమార్ యాదవ్ - వైద్య ఆరోగ్యశాఖ
- నిమ్మల రామనాయుడు - నీటి పారుదల శాఖ
- ఎన్ఎండీ ఫరూక్ - మైనార్టీ వెల్ఫేర్
- ఆనం రాంనారాయణరెడ్డి - దేవాదాయశాఖ
- పయ్యావుల కేశవ్ - ఆర్థికశాఖ
- అనగాని సత్యప్రసాద్ - రెవెన్యూ శాఖ
- కొలుసు పార్థసారథి - గృహనిర్మాణ, ఐ అండ్ పీఆర్
- డోలా బాలవీరాంజనేయస్వామి సాంఘిక సంక్షేమ శాఖ



- గొట్టిపాటి రవి కుమార్ - విద్యుత్ శాఖ
- కందుల దుర్గేశ్ - పర్యాటకం, సినిమాటోగ్రఫీ
- సంధ్యారాణి - మహిళా సంక్షేమం, గిరిజన సంక్షేమ
- బీసీ జనార్ధన్ రెడ్డి - రోడ్లు భవనాల శాఖ
- టీజీ భరత్ - పరిశ్రమల శాఖ
- ఎస్ సవిత - బీసీ సంక్షేమ శాఖ
- వాసంశెట్టి సుభాష్ - కార్మిక శాఖ
- కొండపల్లి శ్రీనివాస్ - సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ
- రామ్ ప్రసాద్ రెడ్డి - రవాణా శాఖ, క్రీడా శాఖ.

**సివిల్స్ ప్రిలిమ్స్ కటాఫ్ 90..!**

జూన్ 16 దేశవ్యాప్తంగా నిర్వహించిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ 2024 పరీక్షలో ప్రశ్నలు గతంతో పోల్చితే తేలికగా ఉన్నాయి. ఈసారి సుధీర్ఘమైన ప్రశ్నలు తక్కువగా.. డైరెక్ట్ ఆన్సర్ చేసే ప్రశ్నలు ఎక్కువగానే అడిగారు. కటాఫ్ మార్కులు 85-90 మధ్య ఉండే అవకాశాలు ఉన్నాయి.

**తెలంగాణ ఎక్సైజ్‌శాఖలో 116 కానిస్టేబుళ్ల పోస్టులు**

తెలంగాణ ఎక్సైజ్‌శాఖలో కానిస్టేబుళ్ల పోస్టులకు సంబంధించి మొత్తం 116 సూపర్ న్యూమరరీ పోస్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం తెలంగాణ ఎక్సైజ్ అకాడమీలో శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లను ఈ పోస్టుల్లో నియమించే అవకాశం ఉంది.

## విద్య, ఉద్యోగ సమాచారం

**తెలంగాణ వైద్యశాఖలో 755 పోస్టుల భర్తీ**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో 531 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్), 193 ల్యాబ్ టెక్నీషియన్లు, 31 స్టాఫ్ నర్సు పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది.

**గురుకులాల్లో వార్డెన్ పోస్టులు.. రాత పరీక్షల షెడ్యూల్**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యా సంస్థల్లో వివిధ పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. అయితే ఈ ఉద్యోగాల భర్తీకి నిర్వహించవల్సిన రాత పరీక్ష లను జూన్ 24 నుంచి 29 వరకు నిర్వహించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ఈ పరీక్షలు కూడా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు.

# తూర్పు నియోజకవర్గం అభివృద్దే నా ధ్యేయం

## గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ వెల్లడి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**
బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గం 57వ వార్డు మద్దిరాల కాలనీ మరియు బసవ తారక రామ నగర్‌లో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న గౌరవ శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ మద్దిరాల కాలనీవాసులు, బసవతారక రామ నగర్ వాసులు, ప్రభుత్వం అసమర్థ్వంతో సైడ్ డ్రైన్స్, నిర్మించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని, చిన్నపాటి వర్షానికి ఇళ్లల్లోకి మురుగునీరు వస్తుందని, తద్వారా ఇళ్లల్లోకి పాములు వస్తున్నాయని వాపోయారు. రోడ్లు సరిగా లేకపోవడం వలన రోడ్లలో నీరు నిలిచి కుంటలుగా మారి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని తద్వారా జ్వరాలు వ్యాపిస్తున్నాయని ఇంకా అనేకమైన సమస్యలను శాసనసభ్యులు నసీర్ గారి దృష్టికి తీసుకువచ్చారు. నసీర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో మాజీ శాసనసభ్యులు ముస్తఫా అసమర్థత వలన నియోజకవర్గంలోని ప్రజలు అన్ని విధాల నష్టపోయి సమస్యల సుడిగుండాలలో చిక్కుకున్నారన్నారు. నేను ఇక్కడే పుట్టి పెరగటం వలన నియోజకవర్గ మీద నాకు మంచి అవగాహన ఉందన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి మద్దిరాల కాలనీవాసులు డ్రైన్స్ సరిగా లేక చిన్నపాటి వర్షానికి మురుగునీరు ఇళ్లల్లోకి ప్రవేశించే పరిస్థితులు ఉన్నాయి కాబట్టి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, వారి సమస్యలను రానున్న ఆరు నెలల్లో పూర్తిగా పరిష్కరిస్తామనారు. మద్దిరాల కాలనీలో ముఖ్యంగా అతి పెద్ద సమస్య అయినటువంటి మురికి నీటి కాలువలు నిర్మాణం చేపడతామని తాత్కాలికంగా డ్రైవ్ ని రైల్వే అధికారులతో మాట్లాడి ఖాళీ ప్రదేశంలోకి డ్రైన్ ను మళ్లీచ్చేటట్టు వంటి కార్యక్రమం,అలాగే మొత్తం ఎనిమిది లైనులకు సంబంధించి డ్రైన్స్ మరియు రహదారులు నిర్మించే కార్యక్రమం చేపడతామని, మంచినీటి పైపులైన్స్, స్ట్రీట్ లైట్స్ సమస్యలని కమిషనర్,నగరపాలక సంస్థ అధికారులను సంప్రదించి వారి ద్వారా ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చామన్నారు. ముఖ్యంగా త్వరితగతిన బసవతారక నగర్‌లో మురికి కాలువలలో మంచినీటి పైపులు ఉన్నాయని వాటిని ప్రక్కకు మరల్చాలని నగర పాలక సంస్థ అధికారులు ఆదేశించారు. తూర్పు నియోజకవర్గంలో ఉన్నటువంటి అనేక సమస్యల మీద పూర్తిగా అవగాహన చేసుకుని ప్రతి సమస్యను కూడా సాధ్యమైనంత వరకు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామన్నారు.రాబోవు కాలంలో అధికారులకు ఆదేశిస్తూ ఉన్నాం నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు ఉంటే అక్కడ కార్యచరణ సిద్ధం చేసుకుని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు గతంలో కూడా చెప్పాము ఇప్పుడు చెప్తున్నాము పేద ప్రజల సంక్షేమమే తెలుగుదేశం జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు సహకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు డి ఈ శ్రీధర్ ఏ ఈ సునీల్, తెలుగుదేశం జనసేన నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, కనకారావు,పల్లెపోగు రమేష్, సుజాత, నాగ కిరణ్, కాసింబాబు ఇమ్రాన్, శ్రీనివాసరావు నగరపాలక సంస్థ సిబ్బంది, తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు 57 వ డివిజన్ పర్యటనలో పాల్గొన్నారు.

# సీడ్స్ షాపులపై మెరుపు దాడి

(మొదటి పేజీ తరువాయి)

కె. ఈశ్వర రావు పర్యవేక్షణలో విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు స్థానిక వ్యవసాయ శాఖ అధికారితో కలిసి తనిఖీలు జరిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు లోని రాధా ఎంటర్ ప్రైజెస్ యజమాని గోపిశెట్టి శ్రీనివాస్, ముసలా వేణు ఇంటి వెనుక ఉన్న గోడౌన్ అద్దెకు తీసుకొని అక్రమంగా వరి విత్తనములు నిల్వ చేసినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. 200 బస్తాల వరి విత్తనాలు నిల్వ చేస్తున్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.3,96,000/-ఉంటుందని అధికారులు వెల్లడించారు.. వీటిని స్వాధీన పరచుకొని 6 ఏ" కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా, బొల్లాపల్లి మండలం మర్రిపాలెంలోని హనుమాన్ సీడ్స్ సెంటర్ లో తనిఖీ చేయగా 5 కంపెనీ లకు చెందిన సోర్స్ సర్టిఫికెట్లు లేకుండా హైబ్రిడ్ విత్తనాలు ఈ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇలా చేయటం సీడ్స్ కంట్రోల్ ఆర్డర్ 1983 ప్రకారం నేరం . రూ.6,94,000/- విలువ గల 10 కిలోల హైబ్రిడ్ విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ ఇన్స్పెక్టర్ ఏ.శ్రీహరి రావు, వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ఎం. రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దోమలు బాబోయ్ దోమలు

(మొదటి పేజీ తరువాయి)

బట్టి ప్రస్తుతం తెనాలి సిటీకి. , మరొక ఫాగింగ్ యంత్రం అవసరమని ప్రజానీకం కోరుతోంది. ఉన్న ఫాగింగ్ యంత్రం సక్రమంగా పని చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు.. ప్రతి నాలుగు వార్డులకు ఒక ఫాగింగ్ యంత్రం అవసరమని భావిస్తున్నారు. ఆ లెక్కన జిల్లా కేంద్రం గుంటూరు పట్టణం వ్యాప్తంగా ప్రతి వీధిలో ప్రతి పది రోజులకు ఒకసారి ఫాగింగ్ జరగాలి. అది జరగడం లేదు. అసలు చాలా ప్రాంతాల్లో ఇప్పటివరకు ఒకసారి కూడా ఫాగింగ్ జరగలేదు.

ఏ కౌన్సిలర్ పరిధిలో ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయో కూడా స్థానికులకు తెలియడం లేదు.హ్యాండీ ఫాగింగ్ మిషన్లు కూడా అవసరం.. పాతవి ఏవైనా ఉంటే వాటిని మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.. గుంటూరు జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల విషయానికి వస్తే దోమల నివారణ చర్యలు దాదాపుగా పూజ్యమనే చెప్పాలి. ఒక్కో గ్రామ పంచాయతీకి ఒక హ్యాండీ ఫాగింగ్ మిషన గతంలో ఇచ్చినట్లు తెలుస్తోంది వీటిలో ఎన్ని ఉన్నాయో, ఎన్ని పనిచేస్తున్నాయో స్పష్టంగా చెప్పలేం కానీ అత్యధిక శాతం పంచాయతీల్లో ఫాగింగ్ జరగడం లేదని మాత్రం వాస్తవం. పంచాయతీల్లో నిధుల కొరతే ఇందుకు కారణం. ఇంటి పన్నులకు లింకువర్షాకాలంలో పారిశుధ్యం మెరుగు, ముఖ్యంగా దోమల నివారణకు గతంలో ప్రతి పంచాయతీకి ఎంఆర్‌హెచ్ఎం నిధుల నుంచి 10వేల రూపాయలు మంజూరు చేసేవారు. మూడేళ్లుగా ఈ నిధులు మంజూరు చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.పంచాయతీ నిధుల నుంచే ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. నిధులమాటెత్తితే ఇంటిపన్నులకులింకుపెడుతున్నారు. ఇంటి పన్నులు వసూలు చేయండి... ఆ నిధులను దోమల నివారణకు ఖర్చు చేసుకోండి అని తెగేసి చెబుతుండటంతో కార్యదర్శులు ప్రజలపై పడుతున్నారు. పంచాయతీ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి పల్లెల్లో ఇంటి పన్ను వసూలు గురించి పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. కానీ ఇప్పుడు పాత బకాయిలతో సహా చెల్లించమని ప్రజలపై ఒత్తిడి తెస్తున్నారు. ఇంటి ముందు మురికి కుంటలు శుభ్రం చేయమని అడిగితే ఇంటి పన్ను కట్టమని అడుగుతుండటంతో ఎందుకొచ్చిన గొడవ అని ప్రజలు మౌనం వహిస్తున్నారు. కొన్ని పెద్దపంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు చేసి, అరాకొరగా అయినా దోమల నివారణ చర్యలు చేపడుతున్నారు. పెరుగుతున్న మలేరియా కేసులు జిల్లాలో ఏఆసుపత్రిని పరిశీలించిన జ్వరపీడితుల సంఖ్య భారీగా కనిపిస్తోంది. చేబ్రోలు, దుగ్గిరాల, తెనాలి, మంగళగిరి, మేడికొండూరు, తాడేపల్లి, తుళ్లూరు తో పాటు ఇతర మండలాల్లో మలేరియా కేసులు నమోదు అవుతున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం మలేరియా కేసులు నామమాత్రంగా ఉన్నా, ప్రైవేటు ఆసుపత్రుల సమాచారం మేరకు మలేరియా కేసుల సంఖ్య పెరుగుతున్నట్లు చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు పారిశుధ్యంపై ముఖ్యంగా దోమల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోని పక్షంలో జిల్లావాసులు రోగాలతో పడకేసే ప్రమాదం ఉంది.

**తెనాలిలో చర్యలు శూన్యం**

తెనాలిలో దోమల నివారణకు అధికారులు చేపట్టిన దాఖలాలు లేవు. ఫాగింగ్ మిషన్లు 6 ఉండగా అవన్నీ మరమ్మతుకు గురయ్యాయి. దోమల ఉత్పత్తికి కారణమైన లార్వాను నివారించేందుకు మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడంలేదు. అంతేగాక దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్నామని చెబుతున్నా అదెక్కడా కనిపించడం లేదు. మరోవైపు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు పారుదల ఏటవాలుగా సాగదు. నిత్యం కాలువల్లో చెత్తా చెదారం తొలగిస్తూ అప్పుడప్పుడు పూడికతీస్తేనే మురుగు పారుదల జరుగుతుంది. అయితే 15 రోజులకోసారి కూడా పూడిక తీయకపోవటంతో మురుగు నిల్వ ఉండి దోమల ఉధృతి పెరుగుతోంది

**పొన్నూరులో నిధులు లేక..**

పొన్నూరు పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. ఇటీవల పారిశుధ్య కార్మికుల సక్రమంగా పనిచేయకపోవడంతో కాలువల్లో మురుగు పేరుకుపోగా పరిస్థితిని చక్కదిద్దే చర్యలు లేకపోవటంతో అనేక ప్రాంతాలలో కాలువలు నిండిపోయి రోడ్లపైనే మురుగు ప్రవహిస్తోంది. మరోపక్క కాలువల్లో పేరుకుపోయిన మురుగుతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల నివారణకుమురుగుకాలువల్లో ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని పూర్తిగా మర్చిపోయిన అధికారులు కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదు. ఫాగింగ్ యంత్రాలు ఉన్నా ఇందనం కొనుగోలుకు నిధుల కొరత ఉన్నట్లు అధికారులుచెబుతున్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన అత్యవసర సేవలకు సాధారణ నిధులనువినియోగించుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నం జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు

**మంగళగిరి లోనూ అంతే!**

మంగళగిరి మున్సిపాలిటీ పరిధిలో ఫాగింగ్ యంత్రాలు ఉన్నా సక్రమంగాఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. కనీసం మురుగు గుంతల్లో ఆయిల్‌బాల్స్ కూడా వేయకపోవడంతో దోమల ఉధృతి ఎక్కువగా ఉంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా పారిశుధ్యం మెరుగుదలకు అధికారులు స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులు డ్రైనేజీలు, పారిశుధ్యం మెరుగుదల, దోమల వ్యాప్తి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజానీకం కోరుతోంది.

# బాలాజీ గుప్తాకు దేశం తమ్ముళ్లు శుభాకాంక్షలు



**మంగళగిరి టౌన్, మేజర్‌న్యూస్ :** మంగళగిరిలో టీడీపీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సంకా బాలాజీ గుప్తా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక దేశం తమ్ముళ్ళు న్యూ బ్యాంక్ కాలనీలో న్యూ బాలాజీ ఫైర్ వర్క్స్ లో బుధవారం బాలాజీ గుప్తాను పలువురు దేశం తమ్ముళ్లు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత నాయకులు కొత్తపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తమ్ముళ్లు బాలాజీ గుప్తాను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా దేశం పార్టీ బీసీ సెల్ కార్యదర్శి చీకుల వెంకటేశ్వరరావు, దేశం నాయకులు సుఖమంచి గిరిబాబు, చిన్నకోట శ్రీనివాసరావు, రంగశెట్టి సీతయ్య, జనసేన రాష్ట్ర చేనేత భాగం కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు తదితరులు బాలాజీ గుప్తాను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# సమస్త జీవులలో నేను ఉన్నాను

**గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్ :** సమస్త జీవరాశులలోను నేను నిండియున్నానని భగవాన్ శ్రీకృష్ణుడు తెలిపాడని చిన్మయా మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో బుధవారం భగవద్గీతలోని జ్ఞానవిజ్ఞానయోగః పై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సువీరానందస్వామి ప్రవచిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునితో సూర్యచంద్రులలోని కాంతిని, వేదములన్నింటిలో ఓంకారమును నేనే అని శ్రీకృష్ణుడు అన్నారని తెలిపారు. పురుషుల యందు పౌరుషమును నేనే అన్నారన్నారు, అగ్నియందు తేజస్సును, తాపసులలో తపస్సును నేనే అని అన్నారు.

# నేడు అమరావతి ప్రాంతంలో సీఎం చంద్రబాబు పర్యటన

**తుళ్లూరు, మేజర్ న్యూస్ :** రాజధాని అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా పర్యటించనున్నారు గురువారం ఉండవల్లి ప్రజావేదిక నుంచి పర్యటన ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దండ్రాయునిపాలెంలో శంకుస్థాపన జరిగిన ప్రదేశాన్ని తొలిసారిగా పరిశీలించనున్నారు. అనంతరం సీడ్ యాక్సిస్ రోడ్ పరిశీలించిన తర్వాత ఆలిండియా సర్వీసెస్ అధికారుల గృహ సముదాయాలు, మంత్రులు, జడ్జిల గృహసముదాయాలు సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలిస్తారు. ఐకానిక్ నిర్మాణాల కోసం పనులు మొదలుపెట్టిన సైట్లు పరిశీలన, రాజధాని ప్రాంతంలో నిర్మాణాల స్థితిగతులు తదితర ప్రదేశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలు నిర్వర్తిస్తారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పవన్ కళ్యాణ్ శాఖాపరమైన సమీక్షలు ప్రారంభించారు. తొలి రోజే శాఖలపై లోతుగా సమీక్ష చేపట్టారు. సుమారు ఆరు గంటలపాటు సంబంధిత శాఖలపై సమీక్షలు నిర్వహించారు. ప్రతి అంశాన్నీ కూలంకషంగా తెలుసుకున్నారు.

**ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం**

తొలుత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించిన పథకాలు, వాటి పురోగతి, శాఖాపరమైన కార్యకలాపాలను ఉన్నతాధికారులు వివరించారు. సుమారు మూడు గంటలపాటు సాగిన ఈ సమీక్షలో శాఖలకు సంబంధించిన ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈ శాఖల ద్వారా గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన వన సంబంధిత పనులకు నిధులను పెంపుదల చేయడం కూడా అటు రైతులు, ఇటు ఉపాధి హామీ కూలీలకు భరోసా కల్పించడంలో భాగమే అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. గురువారం ఈ శాఖలకు సంబంధించిన సోషల్ ఆడిట్, ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులతో సమీక్షిస్తారు.

**పచ్చదనం పెంపు... అటవీ సంరక్షణపై ప్రత్యేక దృష్టి**

సాయంత్రం అటవీ శాఖపై సమీక్ష చేపట్టారు. ఈ శాఖ కార్యకలాపాలను, అటవీ పరిరక్షణ అంశాలు, కాలుష్య నియంత్రణ, పర్యావరణ సంబంధిత విషయాలపై ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించారు. సామాజిక వనాలు, నగర వనాలు పెంపు, జీవ వైవిధ్య మండలి కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. మడ అడవుల పరిరక్షణ, వాటిని పెంచడంపై చర్చించారు. పచ్చదనం పెంచడం, అటవీ సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## అమరావతి రైతు రైతు కూలీలపై పెట్టిన కేసులను తక్షణమే తొలగించాలి



**తుళ్లూరు, మేజర్ న్యూస్ :** రాజధాని ప్రాంతంలో గత 16 వందల రోజులకు పైగా ఉద్యమం చేస్తున్న రైతు రైతు కూలీలపై గత ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని తక్షణమే వాటిని తొలగించాలని రాజధాని ప్రాంత రైతులు కోరారు బుధవారం రాజధాని రాష్ట్ర సచివాలయంలో హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి విన్నవించారు. ముందుగా ఆమెను దృశ్యాలువతో జొన్నలగడ్డ శంకర్రావు సత్కరించారు ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ తప్పకుండా మీ యొక్క విన్నపాన్ని పరిశీలించి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అమరావతి రైతులు చనుమోలు శివలింగయ్య జొన్నలగడ్డ నాగమల్లేశ్వరరావు దాసరి రంగారావు దాసరి నరసింహారావు తదితరులు ఉన్నారు.

**విద్యార్థులకు బ్యాగులు పుస్తకాలు పంపిణీ..**

తుళ్లూరు బాపూజీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు జొన్నలగడ్డ శంకర్రావు బ్యాగులు, పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నంతలో తోటి వారికి సహాయం చేయాలని పేద వర్గాల విద్యార్థిని విద్యార్థులకు సహాయం చేయటం ఎంతో సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్ముల కిరణ్( బాబి) బోదాల రవి తదితరులు పాల్గొన్నారు

## మద్యం మత్తులో ఘర్షణ.. కర్రలు రాళ్లతో దాడి

- ఒకరి పరిస్థితి విషమం
- మరొకరికి తీవ్ర గాయాలు

**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి మండలం పరిధిలోని కాజా ఎస్టీ కాలనీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా ఉన్న ద్విచక్ర దారుడు సడన్ గా బ్రేక్ వేయడంతో మద్యం మత్తులో ఇద్దరి మధ్య వాగ్వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో ఒకరు పరిస్థితి విషమం కాగా,మరొకరికి తలకు గాయాలు కాగా 10 కుట్లు పడ్డాయి. క్షతగాత్రులు ఇరువురు గొడవ ఆపేందుకు ఇరువురు మధ్యకు వెళ్ళగా ఇరు వర్గాల ఘర్షణలో కర్రలతో దాడులు చేసుకోవడంతో తీవ్ర గాయాలు పాలయ్యారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ సిఐ, ఎస్ఐలు క్షతగాత్రులను గుంటూరు ఆసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## 1400 గ్రాముల గంజాయి పట్టివేత

### ఇద్దరు నిందితులను అరెస్ట్



**మంగళగిరి టౌన్ మేజర్ న్యూస్ :** గంజాయి వినియోగంపై ఉక్కు ఉక్కుపాదం మోపుతాం పట్టణ సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 1400 గ్రాముల గంజాయిని స్వాధీనపరుచుకున్నట్లు మంగళగిరి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు మంగళగిరి పట్టణానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని, కాజా గ్రామానికి చెందిన దొడ్డక పవన్ కుమార్ లు మంగళగిరి రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిద్దరిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళగిరి పట్టణంలో గతంలో సుమారు 30 మంది అనుమానితులు ఉన్నారని వీరిలో కొంతమంది మానేశారని, మరికొందరు ఇంకా విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. గంజాయి ఎక్కడినుంచి వస్తుంది ఎక్కడ ఎవరు విక్రయిస్తున్నారు వాటి మూలాలపై ప్రత్యేక గాని పెట్టామని గంజాయి మాదక పదార్థాల వినియోగం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ గంజాయి సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే మా పోలీసు వారికి తెలియజేయాలని వారి పేరు గోప్యంగా ఉంచుతామని మంగళగిరి పట్టణాన్ని గంజాయి రహిత చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని సి ఐ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డ్యూడి, నార్త్ సబ్ డివిజన్ డి.ఎస్.పి సిహెచ్ రవికాంత్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షేక్ ఖాదర్ బాషా, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది.

# దళిత మహిళకు హోం మంత్రి కేటాయించడం అభినందనీయం

### కొలకలూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



**తెనాలి, మేజర్ న్యూస్ :** చంద్రబాబు నాయుడు క్యాబినెట్లో దళిత మహిళ అయిన వంగలపూడి అనితకు హోం శాఖ మంత్రి కేటాయించడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ, తెదేపా సీనియర్ నాయకులు ఉన్నం రాంబాబు పేర్కొన్నారు. ఇటీవల ఏర్పడిన రాష్ట్ర మంత్రి వర్గంలో దళిత మహిళకు హోమ్ మంత్రి దక్కడంపై తెదేపా సీనియర్ నాయకులు ఉన్నం రాంబాబు ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని కొలకలూరు గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్,మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి బుధవారం పాలాబి షేకం చేశారు. ఈ సందర్భంగా ఉన్నం ధర్మారావు మాదిగ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులకు గురి చేసిన అనితకు హోమ్ మంత్రి ఇవ్వడం చంద్రబాబుకు దళితులపై ఉన్న ప్రేమగా భావిస్తున్నామని తెదేపా రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా తెదేపా అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశారని ఇలాంటి పదవులు దళితులకు కల్పించడం చంద్రబాబు నాయుడుకు కొత్తేమి కాదని గతంలో బాలయోగికి స్పీకర్ స్థానం కల్పించాడని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు ఉన్నం రాంబాబు మాట్లాడుతూ దళిత మహిళకు హోమ్ మంత్రి రావడంపై ఆలపాటి రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో కొలకలూరు గ్రామంలో ఉన్న అంబేద్కర్, జగ్జీవన్ రామ్,ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళు లర్పించడం, చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేయడం సంతోషంగా ఉందని వైసీపీని పాతాలానికి తొక్కుతాం అని నెరవేర్చిన పవన్ కళ్యాణ్‌కి అభినందనలు తెలియజేస్తామని తెలిపారు. మంత్రి వర్గంలో ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీలకు ప్రముఖ స్థానం కల్పించారని దళితులకు అండగా ఉండే పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో ఉన్నం చిన్న జాన్, మోదుకూరి దావీదు,ఉన్నం మధు, ఉన్నం సన్నీ,ఉన్నం భార్గవి, ఉన్నం భాస్కరరావు,ఉన్నం రాజశేఖర్,పంట ఇస్సాకు, గొరికపూడి సాల్మాన్, కొలకలూరి వెంకయ్య, సుద్దపల్లి కోటేశ్వరరావు, యడ్లపల్లి విక్కీ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సంస్కృతిని పరిరక్షిస్తున్న ఒంటారియో తెలుగు ఫౌండేషన్



**గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్ :** తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను ఒంటారియో తెలుగు ఫౌండేషన్ పరిరక్షిస్తుందని, దాని కృషి అభినందనీయమని సినీనటుడు, నిర్మాత, దర్శకుడు తనికెళ్ళ భరణి అన్నారు. కెనడా నగరంలోని గ్రాండ్ సినిమా బాంకెట్ సమావేశ మందిరంలో ఒంటారియో తెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సంగీతం-పద్యం-సాహిత్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తనికెళ్ళ భరణి మాట్లాడుతూ కెనడాలోని తెలుగు వారందరిని తలచుకోవడం ఆనందంగా ఉందన్నారు. శ్రీ సీతారామ సేవా మందిరం నిర్మాణం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సభలో భరణి స్వయంగా రచించిన ఆట కదరా శివ, నాలోన శివుడు కలడు తదితర భక్తిగీతాలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నిర్వాహకులు తనికెళ్ళ భరణిని ఘనంగా సత్కరించారు. సభానంతరం నిఖిల్ మ్యూజిషియన్స్ అకాడమి చిన్నారులు ఆలపించిన భక్తిపాటలు, భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్ నీల, ఇజ్జడ శ్రీని తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యను అందించడమే సీఎం ధ్యేయం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగయిన విద్యను అందించటమే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 35వ డివిజన్ పట్టాభిపురం మున్సిపల్ హైస్కూల్, 44వ డివిజన్ ఓరియంటల్ హై స్కూల్లోని విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఉచితంగా కేటాయించిన స్కూల్ బ్యాగులు,పుస్తకాలు, యూనిఫామ్,షూస్ ల పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి విచ్చేసి, విద్యార్థులకు అందజేసారు. ఈ సందర్భముగా గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు ఆకర్షితులు అయి విధముగా విద్యాప్రమాణాలను ఉపాధ్యాయులు పెంచాలని మాధవి కోరారు. ఇప్పుడు చంద్రబాబు చదువుకునే విద్యార్థుల కోసం ఇంటిలో ఎంతమంది ఉంటే అంత మందికి తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ 15000/- ఇవ్వనున్నట్లు త్వరలో దీనిని అమలు చేయబోతున్నామని గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, ఈరంటి వర ప్రసాద్, నారాదాసు ప్రసాద్,జెట్టి బాబు, యర్రాకుల శ్రీను, కన్నసాని బాజీ తదితరులు పాల్గొన్నారు.

# డొమెస్టిక్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి




**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు మల్లికార్జున్పేటలోని సెంట్ ఆన్స్ మనోవికాస కేంద్రం ప్రాంగణంలో బుధవారం అంతర్జాతీయ డొమెస్టిక్ వర్కర్స్ డే అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లేబర్ ఆఫీసర్ వి.హనుమంతు సాయి హాజరయ్యారు. రాష్ట్రకేంద్ర ప్రభుత్వాల ద్వారా అందే వివిధ సంక్షేమ,కార్మిక భద్రత పథకాల గురించి డొమెస్టిక్ వర్కర్స్ కు అవగాహన పరిచారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది డొమెస్టిక్ వర్కర్స్ హాజరయ్యారు . డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ సిస్టర్ లూర్దుమేరీ, ఎం. ఎస్.ఐ.స్టేట్ కోఆర్డినేటర్ సిస్టర్ వ్యాకుల మేరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు డొమెస్టిక్ వర్కర్స్ ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్తులో సాధించాల్సిన డిమాండ్స్ గురించి వివరించారు. సిస్టర్ వ్యాకుల మేరీ ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ కార్మికులకు ఇల్లు కేటాయించాలని,కార్మికులకు సంక్షేమ బోర్డు,సామాజిక భద్రత కల్పించాలని, ఇంటి పని ప్రదేశంగా ప్రకటించాలని,పని పరిస్థితులను నిర్ధారించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనం నెలకు 12000 గృహ కార్మికులకు ఆమోదించాలని మండల స్థాయిలు ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని,వారానికి ఒక సెలవు ఇవ్వాలని గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టాన్ని రూపొందించాలని కోరారు. గృహ కార్మికుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ నందు ప్రస్తుతం గుంటూరు పట్టణంలో 22 బస్తీలు 214 గ్రూపులు 2304 సభ్యులు నమోదయి ఉన్నారని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షురాలు ఆర్.దుర్గ, సెక్రెటరీ బి.లావణ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల డిమాండ్లకు సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించారు.





# సాంప్రదాయ కళలకు ఊపిరి పోస్తున్న జన చైతన్య సమితి

పెదకూరపాడు, మేజర్‌న్యూస్

సాంప్రదాయ కళలకు జనచైతన్య సమితి ఊపిరి పోస్తుందని, మన ప్రాచీన కళల్లో కోలాటం ఒకటని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి దేవిరెడ్డి కిరణ్మయి అన్నారు.జన చైతన్య సమితి ఆధ్వర్యంలో సంస్థ కార్యదర్శి కోలాట శిక్షకులు తుళ్లూరి సాంబశివరావు కోలాటంలో ఉచిత వేసవి శిక్షణకు ఊపిరి పోశారు.ఈసందర్భంగా ఏర్పాటుచేసిన తొలి ప్రదర్శనలో కిరణ్మయి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభకు జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కిరణ్మయి మాట్లాడుతూ దశాబ్దాలు గడిచిన ఇప్పటికి ఈ ఆటకు ఆదరణ తగ్గలేదని ప్రతి వేడు కలో ఇది ఒక అంతర్భాగం అవుతుందని,యువతి యువ కులతో పాటు మహిళలు కూడా కోలాట శిక్షణ పొంది ప్రదర్శించిన తీరు అద్భుతం అన్నారు. జన చైతన్య సమితి నిర్వాహకులు సాంప్రదాయ కళలకు ఊపిరి పోస్తున్నారని





అన్నారు. తహసిల్దార్ జీవిగుంట ప్రభాకర్ రావు మాట్లాడు తూ అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాల్సిన అవ సరం ఉందని కోలాటం ద్వారా శారీరక,మానసిక ధృఢ త్వాన్ని పెంచుకోవచ్చు అన్నారు. కాకతీయ విద్యాసంస్థల అధినేత శీలంనేని సాంబశివరావు మాట్లాడుతూ గతంలో తోలు బొమ్మలాటలు ఉండేవని నేడు కనుమరుగ య్యాయని, కోలాటం అనేది ఒక అద్భుతమైన జానపద కళా రూపమని అన్నారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు కిరణ్మయి, ప్రభాకర్ రావు, సాంబశి వరావు లను కోలాట బృందం ఘనంగా సత్కరించారు.జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, కొర్రపాటి వెంకటేశ్వర్లు, గుడిపూడి బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



సత్తెనపల్లి,మేజర్‌న్యూస్

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేకును కట్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వం దేశ ప్రజలకు చాలా అవసరమని నాయకులు వక్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి జ్ఞానరాజుపాల్, పిసిసి కార్యదర్శి మాదనశెట్టి వేదాద్రి, షేక్ చాంద్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, షేక్ అజీము, కోట ఆనంద్, రవితేజ, కొరబండ ఆంటోనీ, జట్టి శేఖరు, మీసాల శంకర్, మెకానిక్ శివ, దర్శి చిన్న మొదలగు వారు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కత్తెర హెనీ క్రిస్టినా దంపతులు



పెదకూరపాడు, మేజర్‌న్యూస్

గుంటూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్చం అందించిన జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా దంపతులు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరించిన మున్సిపల్ కమిషనర్





వినుకొండ, మేజర్‌న్యూస్: పట్టణంలోని శివయ్య స్థూపం సెంటర్లో బుధవారం కమిషనర్ కృష్ణవేణిట్రాఫిక్ నియంత్రణ చేశారు.హాస్పటల్ కి వెళ్లేందుకు రోగితో వచ్చిన అంబులెన్స్ ట్రాఫిక్ లో చిక్కుకుపోయింది.ఆ వెనుకనే వస్తున్న మున్సిపల్ కమిషనర్ కారు కూడా ట్రాఫిక్ లో చిక్కుకొని పది నిమిషాలు అయినా సరే ట్రాఫిక్ వీడకపోవడంతో స్వయంగా కమిషనర్ కృష్ణవేణి ఆ ప్రాంతాన్ని పరిశీలించి ట్రాఫిక్ క్లియర్ చేయడానికి నడుంబిగించారు.ఫ్రూట్స్ బండ్లను నిర్నిత స్థలంలో వుండే విధంగా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సమస్యను అధిగ మించడానికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించి ట్రాఫిక్ ను నియంత్రించారు. అనంతరం అంబులెన్స్ కు దారి ఇవ్వడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

## ఆర్టీసీ ప్రయాణికులకు బస్టాండ్ లో మెరుగైన సేవలు అందిస్తాం





నరసరావుపేట, మేజర్‌న్యూస్: ప్రయాణాల నిమిత్తం బస్టాండుకు వచ్చే ప్రజలకు సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని నరసరావుపేట ఎమ్మెల్యే డా??చదల వాడ అరవింద బాబు అన్నారు.ఆర్టీసీ బస్టాండ్ లో సదుపా యాలను ఆర్టీసీ ఆర్ఎం,ఆర్టీసీ డిఎంతో కలిసి పరిశీలించారు.గత ప్రభుత్వంలో ఆక్రమణకు గురైన స్థలాలను,చిన్న భిన్నంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ను చూసి అస హనం వ్యక్తం చేశారు.ప్రయాణం బడలికతో వచ్చిన ప్రజలు బస్టాండ్కు చేర గానే ప్రశాంతంగా కనిపించాలి గాని అవస్థలమయమై కనిపించకూడదని తెలి పారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి ప్రయాణికులకు మెరుగైన సదుపా యా లు కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే డా??చదల వాడ అరవింద బాబు ఆదే శించా రు.ఈ కార్యక్రమం లో మున్సిపల్,ఆర్టీసీ అధికారులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యను అందించాలి: ఎమ్మెల్యే అరవింద్ బాబు





నరసరావుపేట, మేజర్‌న్యూస్

కందుకూరి వీరేశలింగం స్కూల్ లోని విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే అరవింద బాబు స్కూల్ కిట్స్ పంపిణీ చేశారు. మెరుగైన విద్యను అందించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ,ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు తొలి ప్రాధాన్యం ఇస్తారని నరసరావుపేట ఎమ్మెల్యే డా??చదలవాడ అరవింద బాబు అన్నారు.ఈ మేరకు నరసరావుపేట పట్టణం పాతురులోని కందుకూరి వీరేశలింగం పాఠశాల విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.నాణ్యమైన విద్య అందించినప్పుడే సమాజం అభ్యున్నతి సాధిస్తుందని అన్నారు.జగన్ రెడ్డి హయాంలో విద్యను వ్యాపారంగా రాజకీయ ప్రచారానికి అవకాశంగా వాడుకున్నారని మండిపడ్డారు.ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయకుండా విద్యా వ్యవస్థను ఉద్ధరించినట్లు అడ్డమైన ప్రసారం చేసుకున్నారు.కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డిఎస్సి పై పెట్టి 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీకి చొరవ చూపారు.అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి రద్దు చేసిన ప్రతి విద్యా పథకాన్ని కూడా పునరుద్ధరిస్తారని చెప్పి చదువు పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. పిల్లల స్కూలు పుస్తకాల పై కూడా తన ఫోటో ముద్రించుకుని జగన్ రెడ్డి ఫోటో పిచ్చి చాటుకున్నారని ఎద్దేవా చేశారు.మాకు ఫోటోలు ముఖ్యం కాదు పేదలకు పేద పిల్లలకు మేలు జరగడమే ముఖ్యంని అన్నారు.అందుకే జగన్ ఫోటోలు ఉన్నాగాని విద్యా కిట్స్ ను పిల్లలందరికీ పంపిణీ చేస్తున్నామన్నారు.ప్రతి విద్యార్థి ఉన్నత విద్య అభ్యసిస్తే సమాజం కూడా మెరుగైన స్థితిలో ఉంటుందని అన్నారు.పిల్లలంతా కిట్స్ ను సక్రమంగా వినియోగించుకుని మెరుగని ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే డా?? చదలవాడ అరవింద బాబు ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి,కపిలవాయి విజయ్ కుమార్,వాసిరెడ్డి రవి,కాకు మాను వెంకట్రావు,కోడూరి రాము,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం



సత్తెనపల్లి, మేజర్‌న్యూస్

జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నియోజకవర్గంలోని ధూళిపాళ్ల జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు బొర్రా వెంకట అప్పారావు ఆదేశాల మేరకు కార్యకర్తలు పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.మిఠాయిలు పంచుకున్నారు.బాణాసంచాలను కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు, అలాగే నియోజకవర్గంలో బొర్రా వెంకట అప్పారావు పడ్డ శ్రమకి ఫలితం దక్కిందని వారు హర్షాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ మండలం నాయకులు నాదెండ్ల నాగేశ్వరావు, జిల్లానాయకులు చిలక పూర్ణ, మండల నాయకులు అద్దేపల్లి రామారావు, షేక్ కాసిం, మట్టంసురేష్ , షేక్ రఫీ, మట్టం మహేష్, అద్దేపల్లి మరలింగయ్య ,భూపతి,పొన్నకోటి భద్రయ్య, మీన్నగంటి సత్యం, వెంకట్రావు జనసైనికులు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## స్కూల్ కిట్ పంపిణీ బీసీ సెల్ అధికార ప్రతినిధి



నరసరావుపేట, మేజర్‌న్యూస్

మండలం లోని పెట్లూరివారిపాలెం మండల పరిషత్ బి.సి ప్రాథమికోన్నత పాఠశాల నందు విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ కిట్ లను పంపిణీ చేయడం జరిగినది. స్కూల్ కిట్లతో పాటు స్కూల్ బ్యాగ్ ,యూనిఫామ్ మరియు పాఠ్యపుస్తకములు ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చక్కగా చదువుకొని వృద్ధి లోకి రావాలని తెలియజేశారు. పాఠశాల లోని సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో పల్నాడు జిల్లా బి.సి సెల్ అధికార ప్రతినిధి కొక్కెర గంగాధర్ యాదవ్ మాట్లాడుతూ విద్యతో పాటు వ్యాయామం ఎంతో అవసరం అని అన్నారు. విద్య ఎంత ముఖ్యమో వ్యాయామం కూడా అంతే ముఖ్యమని ప్రతి ఒక్క విద్యార్థి క్రీడలలో కూడా మంచి గుర్తింపు తీసుకురావాలని అన్నారు . వ్యాయామం చదువులో ఒక భాగమేనని విద్యతోపాటు క్రీడలలో గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చే బాధ్యత గా వహించి రానున్న తరాలవారికి పంతులు గా నిలవాలని వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు దేవిరెడ్డి నాగిరెడ్డి, స్కూలు టీచర్లు,విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# మరోసారి దాతృత్వం చాటుకున్న ఆర్యవైశ్య నేతలు

సత్తెనపల్లి, మేజర్‌న్యూస్

భర్తను కోల్పోయి భర్తను ఇద్దరూ ఆడపిల్లలతో కుటుంబం భారమై ఇబ్బంది పడుతున్న మహిళలకు అనారోగ్యం సైకిల్ సోకింది మెదడుకు సంబంధించిన వ్యాధి రావడంతో ఆర్థికంగా సతమతమవుతున్న ఆ మహిళకు దేవుడిలా ఆర్యవైశ్య నేతలు అండగా నిలిచిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని 22వ వార్డులో నివాసం ఉంటున్న చిన్ని కృష్ణకుమారి గత కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతుంది. ఇంటికి పెద్దదిక్కు లేకపోవడం ఇద్దరు ఆడపిల్లలతో జీవనం సాగిస్తుంది. దానికి తోడు మెదడుకు సంబంధించిన వ్యాధి రావడంతో ఏం చే యాలో తెలియని పరిస్థితిని గమనించిన బంధువు ఆకుతోట దుర్గారావు విష యా న్న ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త రామకృష్ణకి తెలి పాడు. వెంటనే విరాళాల ద్వారా లక్ష పదివేల రూపాయలు సేకరించారు. బుధ వారం కొత్త రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆ నగదును ఆ కుటుం బానికి అంద జేశారు.ఈ



కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మద్ది వెంక టేశ్వర్లు, కొత్త రామకృష్ణ, ఆకుతోట దుర్గారావు, భవిరి శెట్టి హరి మొదలగువారు పాల్గొన్నారు.

# పంట సాగు దారు హక్కు పత్రాలు మంజూరు చెయ్యాలి

నూజెండ్ల, మేజర్‌న్యూస్

అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగు దారు హక్కు పత్రాలు ( సి.సి.ఆర్.సి) మంజూరు చేయాలని మండల తహశీల్దారు యమ్. నయీమ్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ మరియు వ్యవసాయ శాఖ సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీఆర్సీ కార్డులతో కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయన్నారు.గతేడాది సీసీఆర్సీ కార్డులు పొందినవారిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన రెన్యువల్ చెయ్యాలని సూచించారు.ఈ నెలాఖరులోపు రైతు భరోసా కేంద్రం వద్ద రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది కౌలురైతులందరికీ పంట సాగు హక్కు పత్రం పై అవగాహన సదస్సులు నిర్వహించి,కొత్త సి.సి.ఆర్.సి.కార్డులు త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి షేక్ సుగుణా బేగం మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డులు వలన రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రాయితీ పై పొందవచ్చునన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేసి పంటల



బీమా మరియు పెట్టుబడి రాయితీ తదితర పథకాలతో పాటు పండించిన పంట ఉత్పత్తులు కనీస మద్దతు ధరకు విక్రయించుకోవచ్చునని చెప్పారు. ఈకార్యక్రమంలో డిటి అర్జున్ నాయక్,ఏఈవో ఎలీషా,గ్రామ రెవెన్యూ అధికారులు,గ్రామ వ్యవసాయ,ఉద్యాన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవకుడు పివి సురేష్ బాబుకు సత్కారం

వినుకొండ, మేజర్‌న్యూస్

ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల భవనం లో 83 సార్లు రక్తం ఇచ్చి వినుకొండ పురపాలక సంఘంలో వరుసగా మూడుసార్లు కౌన్సిలర్గా విజయం సాధించి ప్రజల ఆశీస్సులు మన్ననలు పొందిన మానవ సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు పివి సురేష్ బాబును ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ భువనగిరి సుబ్రహ్మణ్యం సెక్రెటరీ కాల కృష్ణమూర్తి ట్రెజరర్ కోటేశ్వరరావు మరియు సభ్యులందరూ శాలువాతో సత్కరించి పూలమాలలతో అభినందించారు ఈ సందర్భంగా అధ్యక్షులు సుబ్రమణ్యం మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఎంతోమందికి సేవలందచి కోవిడ్తో మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో మరియు ఐదో వార్డ్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములుగా నిలిచి వినుకొండ పట్టణ అభివృద్ధిని ఆకర్షించే పీవీ సురేష్ చాలామందికి ఆదర్శమని వారికి ఎల్లప్పుడూ మా అందరి ఆశీస్సులు ఉంటాయని తెలియజేశారు తదుపరి సంఘ సభ్యులందరికీ కూడా పివి సురేష్ బాబు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పివి సురేష్ బాబు మాట్లాడుతూ నన్ను సత్కరించి నా బాధ్యతను ఇంకా పెంచాలని మీరందరూ మంచి మనసున్న మనుషులని గొప్ప వారిని ఇంత పెద్ద వయసులో కూడా మీరు సమాజం పట్ల బాధ్యతతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న విశ్రాంతి ఉద్యోగ సంఘం సభ్యులందరినీ ఆదర్శంగా తీసుకుంటానని. సేవా కార్యక్ర



మాలు చేసే మాలాంటి వారికి శివశక్తి లీలాంజన ఫౌండేషన్ పూర్తి అని జీవి ఆంజనేయులు, జి లీలావతి సేవ బాటలోనే మేమందరం కూడా ప్రయాణిస్తామని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రుడు.అన్నప గాధ వెంకటేశ్వర్లు.ch రఘు టీ దిక్షితులు ఆవుల రమేష్, శంకర్రావు పీవీ సుబ్బారావు ఏ రామలింగేశ్వర రావు, ఎం వి శర్మ, సుబ్బయ్య శర్మ,సత్యనారాయణ శర్మ, సత్యనారాయణ రెడ్డి ఆది రాములు, దుబ్బల దాసు రిటైర్డ్ వివిధ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధ మహిళ హత్య



వినుకొండ, మేజర్‌న్యూస్
పట్టణంలోని కొత్తపేట గీతాంజలి స్కూల్ ఎదురు బజారులో వృద్ధ మహిళ పి కోటి రత్నం (75)దారుణ హత్యకు గురైంది. స్థానికులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై దొంగతనానికి వచ్చి ఒక యువకుడు ఇంట్లోకి వెళ్ళి మహిళ మెడలోని బంగారు ఆభరణాలు దొంగలించేందుకు ప్రయత్నం చేయగా,వృద్ధ మహిళ పెనుగులాడటంతో హత్య చేసి పరారైనట్లు సమాచారం.ఆమె గొంతు పై గోర్లు తో పీక నొక్కినట్లు గాయయాలు వున్నాయి.ఆమె పెనుగులాడుతూ కేకలు పెట్టడం తో పక్కన వారు చూసేసరికి దుండుగులు బైక్ పై పరారయ్యారు.సిఐ సాంబశివరావు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజ్ ల ఆధారంగా కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నారు.

## భూసారాన్ని పెంచే పచ్చి రొట్టె విత్తనాలు పంపిణీ



బొల్లాపల్లి, మేజర్‌న్యూస్
మండలం లోని చక్రాయ పాలెం రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వ్యవసాయ శాఖ వారు పొలాల్లో భూసారాన్ని పెంచి, పొలానికి ఎరువులుగా ఉపయోగపడే పచ్చి రొట్టె విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు.మేరకు జనుములు,జిలుగులు 50 శాతం సబ్సిడీతో రైతులకు ఎంపీఈఓ చేతుల మీదుగా అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ వెంకటేష్ నాయక్,సర్పంచ్ లక్ష్మ నాయక్, రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అర్హులైన వాళ్ళందరూ కౌలు రైతు కార్డులు అప్లై చేయండి



రెంటచింతల, మేజర్‌న్యూస్
మండల కేంద్రమైన రెంటచింతల లోని కౌలు రైతులు కౌలుకార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ బ్రహ్మారెడ్డి కోరారు. బుధవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. గతేడాది 2100 మందికి కౌలుకార్డులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రైతు భరోసా , అధిక పంట నష్టపరిహారం చెల్లించాలన్నా, విత్తనాలు, పురుగుమందులు, టార్పలిన్ పట్టలు ఆదునిక వ్యవసాయపనిముట్లు రాయితీపై ఇవ్వాలన్నా కౌలుకార్డులు దోహత పడతాయి. సాగుభూమి పట్టా రైతులు కౌలుదార్లకు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామ్ మోహన్ రావు ఉప తహశీల్దార్ బ్రహ్మయ్య, ఆర్ ఐ కాంతారావు అన్ని గ్రామాల వీఆర్వోలు, ఏఈఓలు పాల్గొన్నారు.

# కోడి కుయక ముందే తెరుచుకుంటున్న బార్, రెస్టారెంట్లు

## మామూళ్ల మత్తులో అధికారులు

వినుకొండ, మేజర్‌న్యూస్
పట్టణంలోని బార్, రెస్టారెంట్ లవని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది.టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన అంతా మా ఇష్టమే అంటూ ప్రతిపక్షం లో ఉన్న నాయకులు వ్యవహ రిస్తున్న బార్, రెస్టారెంట్ యాజమాన్యం తీరు మార్చుకోవట్లేదని ప్రజలు మాట్లాడుతున్నట్లు సమా చారం.ప్రభుత్వం మారిన మాకేంటి మామూళ్ళ మత్తులో బార్ సిబ్బందికి అధికారులు కొమ్ముకాస్తూ తెల్లారకముందే షాప్స్ నిర్వహిస్తున్నా పట్టించుకొని స్థానిక అధికారులు అని ప్రజల ప్రశ్నిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం పై పలు అను మానాలు దారితీస్తుంది.ఇప్పటికైనా




బార్, రెస్టారెంట్లపై వినుకొండ పరిధిలో అడ్డుకట్ట వేసి సమయపాలన పాటించని వారిపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# పల్నాడు మాజీ కలెక్టర్ శివ శంకర్ లోతేటి కలిసిన ఎమ్మెల్యే డా.చదలవాడ

నరసరావుపేట, మేజర్‌న్యూస్
పల్నాడు జిల్లా మాజీ కలెక్టర్ శివశంకర్ లోతేటి ఐఏఎస్ ను నరసరావుపేట ఎమ్మెల్యే డా??చదల వాడ అరవింద బాబు కలెక్టర్ బంగ్లాలో మర్యాద పూర్వకంగా కలిశారు.జిల్లాలో శాంతిభద్రతల పరిర క్షణకు చేసిన కృషి అభినందనీయం అన్నారు. నియోజకవర్గాన్ని దేశంలోనే అభివృద్ధికి మోడల్గా నిలపాలని అనుకుంటున్నట్లు,ఐఏఎస్ అధికారిగా తగు సూచనలు సలహాలు అందించాల్సిందిగా కోరా రు.ఐఏఎస్ అధికారిగా అతను అనుభవాన్ని నియోజ కవర్గ,జిల్లా అభివృద్ధికి అవసరమైన సూచనలు సలహాలకు ఎప్పుడు సంప్రదిస్తామని, సూచనలు ఇచ్చి అభివృద్ధి మార్గంలో పయనించేందుకు తోడ్పడాలని ఎమ్మెల్యే డా??చదలవాడ కోరారు.





# హ్యూమన్ రైట్స్ ,మీడియా నేషనల్ సభ్యుడిగా లక్ష్మణ్

సత్తెనపల్లి, మేజర్‌న్యూస్
హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అండ్ మీడియా ఆర్గనైజేషన్ నేష నల్ లీగల్ సలహాదారుడిగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన యువ న్యాయవాది కోటగిరి లక్ష్మణ్ ను నియమిం చినట్లు హ్యూమన్ రైట్స్ ఛైర్మెన్ ప్రదీప్ తెలిపారు. మానవ హక్కుల సంఘం సంస్థ ఛైర్మెన్ ప్రదీప్ మాట్లాడుతూ లక్ష్మణ్ కు గతంలో ఇదే పదవిని స్టేట్ లో ఇవ్వడం జరిగిందని, ఇప్పు డు తన పనితీరుకు నేషనల్ వైడ్ గా నియమించడం జరిగిం దన్నారు. సమాజంలో మానవ హక్కుల పరంగా ఎవరికి ఏ సలహా కావాలన్న నన్ను ఎప్పుడైనా సంప్రదిం చవచ్చని, సంస్థ పరంగా ఇప్పుడు ఇంకా నాపై మరింత బాధ్యత పెరిగిందని న్యాయవాది లక్ష్మణ్ మీడియాకు తెలిపారు.

# రక్తదాతకు ఘన సన్మానం



వినుకొండ, మేజర్‌న్యూస్:పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయ కులు టీవీ సురేష్ బాబు ఇప్పటివరకు83 సార్లు రక్తదానం చేసి,30 సంవత్స రాలుగా అనేక సేవా కార్యక్రమాల్లోపాల్గొంటూ నిర్వహిస్తున్న ఆయన్ని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం వారి ఆధ్వర్యంలో బుధవారం సంఘ భవనము నందు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి భువనగిరి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించి సురేష్ చేసిన పలు సేవా కార్యక్రమాలను వివరించారు.అనంతరం పి.వి సురేష్ మాట్లాడుతూ ఈ సన్మానం ద్వారా నాకు మరింత బాధ్యత పెరిగిందని, అదేవిధంగా నాలో ఉత్సాహాన్ని నింపింది,వారి ఆశీస్సులు నాకు ఎల్లప్పుడూ ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పివి సుబ్బారావు,కే కృష్ణమూర్తి, సత్యనారాయణ రెడ్డి,రమేష్, రామలింగే శ్వరరావు, సామ్యూల్,వెంకటేశ్వర్లు, వి. గురవయ్య,జె వెంకటేశ్వరరావు, బిపిఎస్ సుందర్రావు,చంద్రశేఖర్, దుబ్బల దాసు,రాఘవయ్య, ఆది రాములు,తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులు ఆత్మీయ సమావేశం



వినుకొండ, మేజర్‌న్యూస్
పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్ నందు గాడ్ ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ బుధవారం పొగాకు రైతులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సభ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.గడిచిన సీజన్లో పొగాకు మంచి ధర లభించడం పై రైతులందరూ హర్షం వ్యక్తం చేశారు.రైతులు పరిశీలించేందుకుగాను కంపెనీ వారు ప్రత్యేకం మైన స్టాల్స్ ను ఏర్పాటు చేసి వ్యవసాయ పరికరాలను ప్రదర్శించారు.ఈ ఆత్మీయ సమావేశానికిముఖ్య అతిదిగా హాజరైన వైస్ ప్రెసిడెంట్ మిస్టర్ డివిస్ జె జితేందర్ ప్రసంగిస్తూ వచ్చే మూడు సంవత్సరాలు పొగాకు మంచి డిమాండ్ ఉందని,మంచి మద్దతు ధర కలగ చేస్తామని హామీ ఇచ్చారు.జనరల్ మేనేజర్ ఎం ప్రభాకర్ మాట్లాడుతూ పొగాకు పంటపై తమ వ్యూహాలను తెలియజేస్తూ పొగాకును సరియైన పద్ధతిలో పండించాలని రైతులు ఎల్లప్పుడూ కంపెనీకి ఈ విధంగానే అనుబంధులై ఉండాలి అని పిలుపునిచ్చారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ వైయస్ పాటిల్ మాట్లాడుతూ ప్రపంచంలో పొగాకు పంటకు కలిగిన డిమాండ్ ను మరియు సుస్థిరమైన పొగాకు ఉత్పత్తి గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ బి ఎం రవి,పి కృష్ణ, జీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# రైతే రాజు రానున్న రోజుల్లో రైతులదే పాలన :ఎమ్మెల్యే

## రైతును దగా చేసిన వైసిపి పాలనకు రైతులే గుణపాఠం చెప్పారు



నరసరావుపేట మేజర్‌న్యూస్ బినరసరావుపేట నియోజకవర్గంలో ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్ని ప్రక్షాళన చేసేందుకు నరసరావుపేట ఎమ్మెల్యే డా॥చదలవాడ అరవింద బాబు శ్రీకారం చుట్టారు.ప్రభుత్వ కార్యాలయాలు,మార్కెట్లు,కాంప్లెక్సులు,ఇతర రంగాల పై అధికారులతో సమీక్షించారు.అనంతరం పలు ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమం కొరకు రెగ్యులర్‌గా భూసార పరీక్షలు నిర్వహించమని అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డులోని నూతన వాటర్ ట్యాంకర్ ద్వారా ఎస్ ఆర్‌కెటి కాలనీ, పరిసర ప్రాంతాలకు త్రాగు నీటి సరఫరా వేగవంతం చేయాలని సూచించారు. మార్కెట్ యార్డు, కమర్షియల్ కాంప్లెక్స్ షాపులు నుండి వెంటనే అద్దె బకాయిలు వసూలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,అగ్రిమెంట్ టైం పూర్తి అయినప్పటికీ షాపులు అప్పగించని వారి పై తగు చర్యలు తీసుకొని ఆదేశించారు.మార్కెట్ యార్డు నూతన ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం, గోడౌన్స్ రిపేర్లు చేయించి రైతులకు ఉపయోగపడే విధంగా పనులు పూర్తి చేయమని ఆదేశించారు. రైతుల తర్వాతనే ఎవరైనా అన్నారు.రైతు సుభిక్షంగా ఉన్న రోజు మాత్రమే రాష్ట్రంలోని ప్రజలకు మేలు జరుగుతుందని,వారికి గిట్టుబాటు ధరలు కల్పించి,పంటలు అమ్ముకోవడానికి మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి, ఏ.డి.ఎం సూర్య ప్రకాశ్‌రెడ్డి, మార్కెట్ సెక్రెటరీ ఆంజనేయులు, మున్సిపల్ డి.ఈ శ్రీనివాసరావు, రాష్ట్ర గోల్డ్ బులియన్ మర్చంట్ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు కడియాల రమేష్, బొడ్డపాటి పాల్గొన్నారు.



# అమ్మవారికి మొక్కుబడి తీర్చుకున్న జనసేన నేత

## పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి, మేజర్‌న్యూస్: నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శాసనసభ్యులుగా గెలుపొందాలని సత్తెనపల్లి పట్టణానికి చెందిన వ్యాపారి జనసేన పార్టీ కార్యకర్త అప్పాపురపు నరేంద్ర ఎన్నికల ముందు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మొక్కుకున్నారు. ఎన్నికలకు ముందు 40 రోజుల పాటు కన్నా లక్ష్మీనారాయణ గోత్ర నామాలతో పూజలు జరిపించారు. అనంతరం కన్నా లక్ష్మీనారాయణ అఖండ మెజార్టీతో విజయాన్ని సాధించిచిన అనంతరం బుధ వారం అమ్మవారి దేవస్థానములో ప్రత్యేక పూజలు జరిపారు.
ఈ కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని పూజలు జరిపారు. పురోహితుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం దేవాలయ ధ్వజస్తంభం వద్ద 101 కొబ్బరి కాయలు కొట్టి నరేంద్ర తన మొక్కుబడి తీర్చుకొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.



# కాసు రాజకీయ సన్యాసంపై స్పందించిన యరపతినేని

పిడుగురాళ్ల మేజర్‌న్యూస్: ఐదు సంవత్సరాల వైసిపి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. జగన్ స్వంత ప్రయోజనాల కోసం మూడు ముక్కల ఆట ఆది రాజదాని లేని రాష్ట్రంగా తయారు చేశారన్నారు. నిశ్శబ్ద విప్లవం నవ శకానికి నాంది పలికిందన్నారు. చంద్రబాబుని పవన్ కళ్యాణ్ పై వ్యక్తి గత విమర్శలు చేశారన్నారు. అందుకే ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారన్నారు. ఈ గురుతర బాధ్యతను దృష్టిలో ఉంచుకొని పోలవరం ప్రాజెక్టు, రాజధానిని ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రిషికొండ పై విలాసవంతమైన భవనాన్ని నిర్మించారన్నారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛను, మెగా డీఎస్సీ, లాండ్ టైటిలింగ్ రద్దు, స్కిల్స్ అకాడమీ, అన్నా క్యాంటీన్లు పై సంతకాలు చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం లో నియోజక వర్గంలో 11 మందిని హత్య చేశారన్నారు. పేకాట క్లబ్బులు, రేషన్ మాఫియా, తెలంగాణ మద్యం అక్రమ వ్యాపారం, మైనింగ్ మాఫియా, ప్రభుత్వ ప్రైవేట్ భూములు ఆక్రమణలు చేశారన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలనీ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అధికారం కోసం కృషి చేసిన నాయకులను, కార్యకర్తలకు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

గుత్తికొండ బిలంను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామన్నారు. ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం స్వీకరిస్తానన్న సవాల్‌ను స్వీకరించిన కాసు మహేష్ రెడ్డి మాట మీద నిలబడతాడని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో రెండు మూడు వేల ఇళ్లు కట్టించి ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. విలేకరులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్నారు. బైపాస్ రోడ్డు పనులు అరకొరగా చేసి ఓపెన్ చేశారన్నారు.

# పురపాలక సంఘం పరిధిలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్





నరసరావుపేట మేజర్‌న్యూస్: నర్సరావుపేట పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి మార్నింగ్ విజిట్ లో భాగంగా 10వ వార్డు లోని సతీష్ రోడ్డు మరియు రిక్షా సెంటర్ పరిసర ప్రాంతాల నందు పర్యటించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సతీష్ రోడ్డు ఏరియా కమర్షియల్ ఏరియా ఉండడం అదే విధంగా బస్టాండ్ మరియు రైల్వే స్టేషన్‌లోకి కనెక్టివిటీగా ఉండడం వలన ఎక్కువగా రద్దీగా ఉంటుంది కావున వ్యాపారస్తులు రోడ్లపై ఆక్రమించి కాలువలపై షాపులను నిర్మించుకోవడం తద్వారా వాహనదారులకు పాదా చారులకు తో పాటుగా మున్సిపల్ సిబ్బందికి కాలువలు శుభ్రం చేయడానికి వీలు పడకుండా ఉండడం కాలువలు నిల్వ అవడం జరుగుతుంది. కావున కమర్షియల్ ఏరియాకి సంబంధించి ఇండ్ల యజమానులు గాని వ్యాపారస్తులు గాని తమ షాపుల ముందు ఆక్రమణ చేసుకుని ఎటువంటి వ్యాపారాలు చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉన్నదని అట్ల చేసినట్లయితే వారికి జరిమానా విధించడంతోపాటు ఆ సంబంధిత ఆక్రమణ షాపులన్నింటినీ తొలగించడం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశిస్తూ ముందుగా వారికి నోటీస్ మరియు ఫైన్ వేసి కాలువలపై నిర్మించిన పర్మినెంట్ స్ట్రక్చర్లను తొలగించాలని తెలియపరిచారు. సదరు కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు శానిటేషన్ ఇన్స్పెక్టర్ రామకోటయ్య వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బ్యాంక్ మేనేజర్ మునివర్మకు సత్కారం

గుంటూరు రూరల్, మేజర్‌న్యూస్: బదిలీపై వెళ్తున్న గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ యూనియన్ బ్యాంక్ మేనేజర్ మునివర్మ ను పలువురు బుధవారం ఘనంగా సత్కరించారు. గత మూడు సంవత్సరాలుగా మునివర్మ బ్యాంకు ద్వారా ప్రజలకు, రైతులకు విశేష సేవలు అందించారని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పూలమాల, శాలువాతో ఆయన్ని ఘనంగా సత్కరించారు.

